

## ఆకాశంలో ఢీ కొన్న విమానాలు

న్యూఢిల్లీ: పోర్చుగల్‌లోని బేజా విమానాశ్రయం వద్ద ఆదివారం జరిగిన ఎయిర్ షోలో రెండు చిన్న విమానాలు ఢీకొన్నాయి. ఆకాశంలో ఎగురుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఓ పైలట్ ప్రాణాలు కోల్పోగా, మరొక పైలట్ గాయపడ్డారు. ఆరు విమానాలు విన్యాసాలు చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. దీంతో ఎయిర్ షోకు అంతరాయం ఏర్పడింది. ఈ విన్యాసాల్లో పదుల సంఖ్యలో సైనిక విమానాలు, హెలికాప్టర్లు పాల్గొన్నాయి. ప్రమాదానికి గురైన విమానాలు యాక్ స్టార్స్ ఏరోబేటిక్ పెట్రోల్‌కు చెందినవని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## ‘నీట్–యూజీ పరీక్ష మళ్లీ నిర్వహించాలి’

న్యూఢిల్లీ: నీట్–యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ అయ్యిందన్న వార్తల నేపథ్యంలో ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మే 5న నీట్‌ను నిర్వహించారు. పరీక్ష ఫలితాలు జూన్ 14న రాబోతున్నాయి. పిటిషన్‌పై సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ ఈ వారంలో విచారణను చేపట్టనున్నది.

మరిన్ని వార్తలు
ntnews.com లో చూడగలరు

## ఎల్‌నినోకు ఎండ్ కార్డ్

**లానినాగా మారనున్న పరిస్థితులు**

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా విపరీత వాతావరణ పరిస్థితులు, రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలకు కారణమైన 2023–24 ఎల్‌నినో పరిస్థితులు ఈ ఏడాది లా నినాగా మారబోతున్నట్టు వరల్డ్ మెటెరోలాజికల్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎంవో) తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ ప్రపంచంలోనే అత్యంత వేడి నెలగా రికార్డయింది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గత 13 నెలలుగా రికార్డుస్థాయికి చేరుకున్నాయి. ఎల్‌నినో పరిస్థితులే ఇందుకు కారణం. డబ్ల్యూఎంవో ప్రకారం జూన్–ఆగస్టులో ప్రస్తుత పరిస్థితులు తటస్థంగా, లేదంటే లా నినాగా మారేందుకు 50% అవకాశాలున్నాయి. జూలై–సెప్టెంబర్ మధ్య లా నినా పరిస్థితులు 60%, ఆగస్టు–నవంబర్ మధ్య 70 శాతానికి పెరిగే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ కూడా ఇలాంటి అంచనాలే వెలువరించింది.

## సకాలంలో అరెస్ట్ చేయకే మాల్యా, నీరవ్ పరార్

- దర్యాప్తు సంస్థలదే వైఫల్యం
- ముంబై ప్రత్యేక కోర్టు వ్యాఖ్యలు

ముంబై: ఆర్థిక నేరగాళ్లను సకాలంలో అరెస్ట్ చేయడంలో దర్యాప్తు సంస్థలు విఫలమయ్యాయని ముంబైలోని ఓ స్పెషల్ కోర్టు వ్యాఖ్యానించింది. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ వంటివారు విదేశాలకు పారిపోవడానికి కారణం వారిని సకాలంలో దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేయకపోవడమేనని పేర్కొన్నది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యోమేష్ షా పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిలు మంజూరైందని, అయితే విదేశాలకు వెళ్లాలంటే, ముందుగా కోర్టు అనుమతి పొందాలని షరతు విధించారని, ఆ షరతును సడలించాలని వ్యోమేష్ కోరారు. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. అయితే ఈ పిటిషన్‌ను అనుమతిస్తే, నీరవ్ మోదీ, మాల్యా, మెహుల్ చోక్సీ వంటివారి వల్ల ఎదురైన పరిస్థితులు వస్తాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వాదించింది. ఈడీ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఈ ముగ్గురినీ సకాలంలో అరెస్ట్ చేయడంలో దర్యాప్తు సంస్థలు విఫలమవడం వల్లే వారు దేశం విడిచి వెళ్లిపోగలిగారని వ్యాఖ్యానించింది.

## జీతాలు పెంచమనడంలో భారతీయ మహిళలే టాప్

న్యూఢిల్లీ: భారతీయ మహిళా ప్రొఫెషనల్స్ ఇతర దేశాల మహిళల కంటే ఎక్కువ ఆత్మవిశ్వాసం, ఆశావాదం గలవారని జాబ్ లిస్టింగ్స్ సైట్ ‘ఇండీడ్’ అధ్యయనం వెల్లడించింది. జీతం పెంచాలని కోరడంలో భారతీయ మహిళలు ప్రథమ స్థానంలో నిలిచారు. భారతీయ మహిళల్లో 65% మంది తమకు జీతాలు పెంచాలని కోరారు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న అమెరికాలో 51% మంది మహిళలు జీతాల పెంపును కోరారు. ఫ్రాన్స్, జర్మనీలలో 50% మంది, కెనడాలో 47% మంది, బ్రిటన్‌లో 45% మంది మహిళా ప్రొఫెషనల్స్ జీతాలు పెంచాలని గతంలో యాజమాన్యాలను కోరారు. ఇండీడ్ ఇండియా డైరెక్టర్ నిశిత లాల్వానీ మాట్లాడుతూ వేతనాల వ్యత్యాసాలను తగ్గించడానికి యాజమాన్యాలు చేపడుతున్న చర్యలపై భారతీయ మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.




















